క్లుప్తంగా

రోడ్లు నిర్మాణానికి భూమిపూజ

సంతకవిటి: మండలంలోని కొండగూడెం, కేఆర్ పురం, జీఎస్ పురం, అప్పలాగ్రహారం గ్రామాల రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

రాజాం సిటీ: స్థానిక బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి వేణుగోపాలనాయుడు, ఉపాధ్యక్షుడిగా నక్క మురళీధరరావు, సాధారణ కార్యదర్శిగా అల్లెన సత్యనారాయణ, కోశాధికారిగా యందవ అశోక్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా శాసపు జయలక్ష్మి, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా వి.జితేంద్రకుమార్, కార్యవర్గ సభ్యులుగా రెడ్డి విజయ్‌కుమార్, శెట్టి పోలారావు, వై.తన్మశ్రీనివాసరావు, కె.రమణమూర్తి, ఇనుమల శ్రీరాములునాయుడు ఎంపికయ్యారు.

27న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 27వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) సమావేశం నిర్వహించనున్నామని నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'నెమ్మి నీలం కథలు–పరిశీలన' అనే అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ప్రసంగించనున్నారన్నారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి భాషాభిమానులు, సాహితీవేత్తలు, కవులు, రచయితలంతా హాజరుకావాలని కోరారు.

సూర్యనారాయణ మాస్టారు మృతి



బొబ్బిలి: విశ్రాంత ఉపాధ్యాయుడు రావుపల్లి సూర్యనారాయణ మాస్టారు(85) మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం బొబ్బిలిలోని తన స్వగృహంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ రేపు

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషోపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మొత్తం 67 మందికి 14 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బి.పరమేశ్వర్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

910 మట్టి నమూనాల సేకరణే లక్ష్యం

బాడంగి: మండల వ్యాప్తంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 910 మట్టి నమూనాల సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏవో కె.శిరీష్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఇప్పటివరకు 210 మట్టి నమూనాలు సేకరించామని, మిగిలినవి ఈ నెలాఖరులోగా సేకరిస్తామన్నారు.ది

ఉపాధి బిల్లులు అందక వేతనదారుల అవస్థలు

బాడంగి: ఉపాధి హామీ పథకం బిల్లులు అందకపోవడంతో వేతనదారులు అవస్థలు పడుతున్నారు. సంక్రాంతి పండగ నుంచి ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు అందలేదని, దీంతో తమ కుటుంబ పోషణ కష్టతరమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కనీసం రెండు, మూడు వారాలకోసారి అయినా డబ్బులు అందేవని, ఇప్పుడు నెలల తరబడి పనిచేస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని, త్వరితగతిన బకాయి వేతనాలు చెల్లించేలా చూడాలని వేతనదారులు కోరుతున్నారు.

అమ్మవారికి వెండి పంచ హారతి బహూకరణ



వెండి పంచ హారతి అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి పంచ హారతిని బహూకరించారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కుమిలి రమణ, పార్వతి దంపతులు అమ్మవారికి దీన్ని బహూకరించారు. రూ.12 వేలు వెచ్చించి దాదాపు 128 గ్రాముల వెండి పంచ హారతిని అమ్మవారికి దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్, ఆలయ అర్చకులు రవిశర్మలకు అందజేశారు.

ఉద్యాన పంటలకు ఊతం!

- ఉద్యానానికి ఉపాధి పథకం అనుసంధానం
- శతశాతం రాయితీపై పండ్లతోటల మొక్కల పంపిణీ
- సాగుకు, పంట సంరక్షణకు ఆర్థికసాయం
- నియోజకవర్గంలో 80 మందికి పైగా దరఖాస్తు



సంతకవిటి మండలం, సురవరం గ్రామంలో సాగు చేస్తున్న కొబ్బరితోట



అంబఖండిలో ఉద్యాన పంటల సాగును పరిశీలిస్తున్న ఏపీవో హరనాథరావు(ఫైల్)

రాజాం: ఉపాధి హామీ పథకం..ఉద్యానానికి ఊతమిస్తోంది. ఉద్యాన పంటల సాగుకు పథకాన్ని అనుసంధానం చేయడం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి, ఆర్థిక తోడ్పాటునందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులను కొబ్బరి, మామిడి, సపోటా, కూరగాయల సాగు వైపు ప్రోత్సాహిస్తున్నారు. శతశాతం రాయితీతో ఆయా పంటల మొక్కలను ఉపాధి పథకం కింద అందజేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యాన తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ ఏడాది రాజాం నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 80 మందికి పైగా రైతులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో ఇప్పటివరకు 34 మందికి ఉద్యాన మొక్కలు అందజేశారు.

బహుళ ప్రయోజనం..

ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటల సాగు అనేది రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుస్తోంది. మెట్టు ప్రాంతాల్లో ఎటువంటి పంటలు పండించడానికి వీలులేని రైతులకు ఈ పథకం చాలా ఉపయోగపడుతోంది. మరోవైపు సాగుకు పనికిరాని భూముల్లో ఉద్యాన పంటల సాగుతో భూమి పచ్చదనం సంతరించుకోనుంది. ఇదిలా ఉంటే రైతులు ఉద్యాన మొక్కలు నాటిన దగ్గర నుంచి మూడేళ్ల పాటు రైతు కుటుంబానికి, సాగు పనులకు వచ్చే మరో రెండు, మూడు కుటుంబాలకు ఏడాది పొడవునా ఉపాధి పథకం ద్వారా వేతనాలు రూపంలో ఆదాయం సమకూరనుంది.

ఎకరా నుంచి రెండెకరాలు..

రైతులకు పెట్టుబడితో పనిలేకుండా ఆసక్తి ఉన్న రైతులకు ఎకరా నుంచి రెండు ఎకరాల విస్తీర్ణంలో మొక్క రకం ఆధారంగా వందశాతం రాయితీతో ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తారు. మామిడి, సపోటా, జామ, జీడిమామిడి, నిమ్మ, తైవాన్ జామ, డ్రాగన్ ఫ్రూట్, మునగ, గులాబీ, మల్లె, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, బత్తాయి తదితర మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల మొక్కలను ఉచితంగా అందిస్తారు. నేల స్వభావం ఆధారంగా ఏ నేలలో ఏ రకమైన పండ్లతోటలు వేస్తే బాగుంటుందో వ్యవసాయ, ఉద్యాన శాఖలు నిర్ధారించి, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తుంది.

పథకం మంజూరు ఇలా..

ఆసక్తి ఉన్న రైతులు తమ గ్రామ ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌కు పంటపొలం వివరాలతో పాటు జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను దరఖాస్తుతో పాటు అందించాలి. ఆ తర్వాత ఉపాధి పథకం టెక్నికల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చి, పరిశీలన చేసి ఉద్యాన శాఖ అనుమతికి దరఖాస్తులు పంపిస్తారు. భూసారాన్ని బట్టి ఏ రకమైన నేలలో ఏ రకమైన పంటలు వేస్తే దిగుబడులు సాధించవచ్చో కూడా రైతులకు వివరిస్తారు. రైతు ఆమోదం తెలిపిన వెంటనే ఉపాధి పథకం ద్వారా మొక్కలు అందిస్తారు. ఎకరాకు 60 నుంచి 70 మొక్కలు ఇస్తారు. వాటిని నాటేందుకు గుంతలు తవ్వడానికి ఎకరాకు రూ.11,500లు, కంచె వేసేందుకు రూ.15,00లు అందిస్తారు. ప్రతినెలా ఎకరా సాగులోని మొక్కలకు నీటిని అందించేందుకు, వాటి సంరక్షించేందుకు రూ.1500లు ఇస్తారు. పంట రకం ఆధారంగా 6 నెలల నుంచి మూడేళ్లలో ఫలసాయం వస్తుంది. ఈ ఫలసాయాన్ని కూడా రైతే పొందుతారు. మూడేళ్ల వరకు ఎకరా సాగుకు సంబంధించి, రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రైతుకు సాయం అందుతుంది.

కొబ్బరి మొక్కలు ఇచ్చారు..

మాకు ఉపాధి హామీ పథకం కింద కొబ్బరి మొక్కలు అందజేశారు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగాయి. మరో రెండేళ్లలో పంట చేతికందివచ్చే అవకాశాలు ఉన్నాయి.

–గంటా షణ్ముఖరావు, సురవరం, సంతకవిటి మండలం

ఆర్థికసాయం చేస్తున్నారు..

మా పొలాల్లో కొబ్బరి మొక్కలు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు ఉచితంగా ఇచ్చిన 48 మొక్కలను పొలాల్లో వేసి పెంచుతున్నాను. పంట సాగు, సంరక్షణకు ఆర్థికసాయం చేస్తున్నారు.

–శాసపు సూర్యనారాయణ, అంబఖండి, రేగిడి మండలం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఉద్దవోలు గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

తెర్లాం: గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వ్యక్తులైనా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు హెచ్చరించారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు గ్రామదేవత ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామంలో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు సైబర్ నేరాల బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట తెర్లాం హెచ్‌సీ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉగ్రదాడి ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ఉగ్రవాదుల చర్యను ఖండించాలని నినాదాలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాజాం సిటీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొబ్బిలి రోడ్డులోని అర్బన్ పీహెచ్‌సీ నుంచి పాలకొండ రోడ్డులోని అంబేడ్కర్ జంక్షన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఉగ్రవాదులు చేసిన ఈ అమానవీయ చర్యను ప్రతిఒక్కరూ ఖండించాలని వక్తలు పిలుపునిచ్చారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్, సింహాచలం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, ఆర్‌వీజే నాయుడు, టీటీవీ రమణమూర్తి, పెంకి చైతన్యకుమార్, ఆర్నిపల్లి వెంకటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల నిధుల దుర్వినియోగంపై విచారణ



పొదుపు సంఘాల సభ్యుల కోసం వేచి చూస్తున్న వెలుగు అధికారులు, సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో పొదుపు సంఘాల రుణాల నిధుల దుర్వినియోగంపై శుక్రవారం విచారణ జరిగింది. గ్రామంలో మొత్తం 108 పొదుపు సంఘాలు ఉండగా, గత కొన్నేళ్లుగా ఆయా సంఘాల వ్యక్తులకు సంబంధించి, పొదుపు, రుణాల సొమ్ము వారి ఖాతాల్లోకి చేరలేదని, తమ డబ్బులను వీవోఏ తన సొంతానికి వాడుకున్నట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు జిల్లాలోని పలు మండలాల నుంచి సీసీలు, వెలుగు అధికారులు గ్రామానికి చేరుకుని, విచారణ చేశారు. అయితే కేవలం మూడు సంఘాల మహిళలు మాత్రమే తమ వద్ద ఉన్న రికార్డులతో అధికారుల వద్దకు హాజరుకాగా, మిగిలిన వారు రాలేదు. ఫిర్యాదులు చేస్తున్నారే గానీ విచారణకు సహకరించడం లేదని, ఫిర్యాదులు చేసిన వారే విచారణకు రాకపోతే తామెలా న్యాయం చేయగలమని అధికారులు అంటున్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కందకాలు తవ్వకాల పరిశీలన

రేగిడి: మండలంలోని నాయురాళ్లవలస, లచ్చన్నవలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లోని జీడిమామిడి తోటల్లో చేపడుతున్న కందకాలు తవ్వకపు పనులను ఏపీవో ఎస్.హరనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చేపట్టే ఈ పనులతో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. భూగర్భజలాల సంరక్షణతో పాటు మొక్కలకు కావాల్సిన నీరు లభ్యమై పంట దిగుబడి బాగా వస్తుందని ఏపీవో తెలిపారు.

ప్రమాద బీమా సద్వినియోగం కావాలి



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

బొండపల్లి: ఉపాధి వేతనదారుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు దరఖాస్తులు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.తులసీనాథ్ సూచించారు. మండల కేంద్రంలోని జగ్గన్న బందలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులకు ఈ పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి వేతనదారు ఏడాదికి 20 రుపాయలు చెల్లించి ఈ బీమాలో చేరవచ్చన్నారు. ప్రమాదవశాత్తు వేతనదారు మరణిస్తే కుటుంబ సభ్యులుకు రూ.2 లక్షల బీమా అందుతుందన్నారు. ఈ నెలాఖరులోగా తమ దరఖాస్తులను సంబంధిత క్షేత్ర సహాయకులకు అందజేయాలని సూచించారు. ఏపీఓ జి.అరుణ పాల్గొన్నారు.


బాధ్యతగా పనిచేయాలి

రేగిడి: అగ్రికల్చర్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి గ్రామ రైతు భరోసా కేంద్రంలో మండలంలోని పలు గ్రామ సచివాలయాల వీఏఏలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. వేసవి, పొడి దుక్కులు, ఇంకుడు గుంతలు తవ్వే కార్యక్రమం రైతులతో చేయించాలని తెలిపారు. కట్టిజనుము, పిల్లిపెసర విత్తనాలు ఖరీఫ్ దుక్కులకు ముందు వేసేలా చూడాలన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

వేపాడ: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. మందుల నిల్వలు, వ్యాధి నిరోధక టీకాలపై వివరాలు సేకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు శతశాతం వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మందుల స్టాకు రిజిస్టరు పరిశీలించారు. వైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం వద్దు..



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి వైద్యాధికారికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

లక్కవరపుకోట : వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, ప్రతీ ఒక్కరు సమయపాలన పాటించాలని లేదంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి జీవనరాణి హెచ్చరించారు. మండల కేంద్రంలోని లక్కవరపుకోట పీహెచ్‌సీని ఆమె శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఓపీపై ఆరా తీశారు. ప్రస్తుత గదిని పరిశీలించి తగు చూచనలు చేశారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయాలని రిఫర్ చేయవద్దని సూచించారు. అలాగే మందుల నిల్వలను తనిఖీ చేశారు. వైద్యాధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారి నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: మండలంలోని వేపాడ – సోంపురం జంక్షన్ నుంచి ఆతవ గ్రామానికి వేసిన సీసీ రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ శాఖాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆతవ జంక్షన్ నుంచి ఆతవ గ్రామానికి సుమారు 2.1 కి.మీ. మేర పీఐయూ నిధులు రూ.1.28 కోట్లతో చేపట్టిన తారురోడ్డు నాణ్యతను పరిశీలించారు. ఈఈ ప్రదీప్‌కుమార్, డీఈ సోములు, సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావు, జేఈ మానస తదితరులు నాణ్యతను చూశారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఎమ్మెల్యే గారూ.. పింఛన్ ఇప్పించండయ్యా..



దివ్యాంగురాలైన తన కూతురికి పింఛన్ ఇప్పించండయ్యా అని సంతకవిటి మండలం, రంగారాయపురానికి చెందిన లావేటి వెంకటరావు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వద్ద మొరపెట్టుకున్నారు. సంతకవిటి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌కు హాజరైన ఎమ్మెల్యేను వెంకటరావు కలిసి తన కుమార్తె మృదుల అంగవైకల్యం(కనీసం నడవలేని పరిస్థితి) గూర్చి వివరించారు. పింఛన్ డబ్బులు వస్తే చికిత్సకు అవసరమైన ప్రాథమిక అవసరాలైనా తీరుతాయని, త్వరగా పింఛన్ మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పహల్గామ్ దాడి మృతులకు సంతాపం ప్రకటిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం పాటించారు. –సంతకవిటి

ఉగ్రదాడి అమానుషం



జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి అమానుషమని, ముష్కరుల దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతిలు అన్నారు. ఇదే విషయమై వారు రామభద్రపురంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఉగ్రమూకల దాడిలో మరణించిన వారి కుటుంబాలకు తమ తరపున, తమ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి అని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. అలాగే ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు ఉన్నారు.

–రామభద్రపురం

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు!



ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా రాజాం మండలం, పొగిరి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సకాలంలో జ్వర లక్షణాలు గుర్తించి సత్వరమే చికిత్స అందజేయడం ద్వారా మలేరియాను సమూలంగా నిర్మూలించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి జి.భార్గవి తెలిపారు. దోమల కారణంగా ప్రబలే మలేరియాను అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సి ఉందన్నారు. అనంతరం దోమకాటు.. ఆరోగ్యానికి చేటు, నీటితొట్టెలపై మూత.. దోమల పెరుగుదలకు కోత.. స్వచ్ఛభారత్ పాటిద్దాం.. మలేరియాను నివారిద్దాం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

–రాజాం సిటీ

మాజీ సీఎం జగన్‌ను కలిసిన డాక్టర్ తలే రాజేష్



రాజాం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదే విషయాన్ని డాక్టర్ రాజేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలకు మనమంతా అండగా నిలవాలని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవాలని, వారికి పార్టీ కూడా ఆదుకుంటుందన్న భరోసానివ్వాలని పార్టీ అధినేత సూచించారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితి, కార్యక్రమాలను వివరించగా సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి వెదలు వేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని సోమరాజుపేట, అంబఖండి గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి సేద్యం దాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు వివరించారు. అనంతరం జిల్లేడు, పత్ర ద్రావణాలు, తూటాకు కషాయం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంటలు తెచ్చి పెట్టే ప్రకృతి సాగును రైతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు లక్ష్మంనాయుడు, వరలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చిన్నకోడిశ గ్రామంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లి నారాయణరావు అనే రైతు పొలంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి వెదలు వేయడం(విత్తనాలు నాటడం)పై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీనరసింహమూర్తి, సమన్వయకర్త శరత్‌బాబు పాల్గొన్నారు.